సాక్షి కర్నూలు

శుక్రవారం ׀ 6 ׀ అక్టోబర్ ׀ 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం కర్నూలుకు చెందిన జస్వంత్‌కుమార్ రూ.1,00,116లు విరాళంగా అందజేశారు.



970 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి 970 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. డ్యాంలో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



భగవద్గీత గ్రంథాల పంపిణీ

శ్రీశైలంటెంపుల్: స్వర్ణ యుగ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ చేతుల మీదుగా శ్రీశైలంలో విద్యార్థులకు, భక్తులకు 100 భగవద్గీత గ్రంథాలను గురువారం పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

సహకార వ్యవస్థ బలోపేతంపై దృష్టి

- నేడు కలెక్టర్ ఆధ్వర్యంలో డీసీడీసీ మొదటి సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మొదటి సారిగా జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ(డీసీడీసీ) సమావేశం కానుండటం విశేషం. జిల్లా సహకార అభివృద్ధి కమిటీకి జిల్లా కలెక్టర్ జి.సృజన నేతృత్వం వహిస్తారు. మెంబర్ కన్వీనర్‌గా జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు వ్యవహరిస్తారు. డీసీడీసీ మొదటి సమావేశం ఈ నెల 5న కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ సృజన ఆధ్వర్యంలో జరగనుంది. సహకార వ్యవస్థ ద్వారా మల్టీపర్పస్ గోదాముల నిర్మాణం జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీసీడీసీ ఏర్పాటైనట్లు జిల్లా సహకార శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

నేడు ఆలూరులో 'జగనన్నకు చెబుదాం-స్పందన'

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాన్ని శుక్రవారం ఆలూరులో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి ఉన్నతాధికారులు వినతులను స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆర్‌యూ రిజిస్ట్రార్‌గా సుందరానంద పుచ్ఛ



నియమాక పత్రాన్ని అందజేస్తున్న వీసీ ఆనందరావు

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఆచార్య వెంకట సుందరానంద పుచ్చ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆచార్య బాయినేని శ్రీనివాసులు బాధ్యతల నుంచి రిలీవ్ కావడంతో వెంకట సుందరానంద పుచ్చ ఎఫ్‌ఏసీ రిజిస్ట్రార్‌గా నియామక పత్రాన్ని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు చేతుల మీదుగా అందుకున్నారు.

కారుణ్య నియామకాలకు చర్యలు




అభ్యర్థుల వివరాలు తీసుకుంటున్న డీఆర్వో కె.మధుసూదన్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ కోవిడ్‌తో మృతి చెందిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్వో కె.మధుసూదన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్వో కార్యాలయంలో కారుణ్య నియామకాలపై చర్చించారు. బాధిత కుటుంబ సభ్యులకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా డీఆర్వో, జెడ్పీ సీఈఓ ఆధ్వర్యంలో కమిటీ ఏడుగురి నుంచి శాఖల కేటాయింపు ఆప్షన్ తీసుకుంది. త్వరలోనే వీరికి ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.

హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీ నాగశ్రీనివాసరావు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు కోరారు. గురువారం ఆయన స్థానిక కలెక్టరేట్ సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం, ఆనంద నిలయం, బీసీ బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలోనే ... ఆయన ఆయా వసతి గృహాల్లోని సౌకర్యాలు పరిశీలించి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆయా హాస్టళ్లలోని రిజిస్టర్లను కూడా పరిశీలించి వాటిలో ఏవైనా లోపాలు ఉంటే అవసరమైన చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు.



హాస్టల్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న జడ్జి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు

మగ్గం మెరిసేలా.. నేతన్న నవ్వేలా!

- చేనేత రంగం అభివృద్ధికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 90 శాతం సబ్సిడీపై అధునాత యంత్ర పరికరాలు
- ఆదోని, ఎమ్మిగనూరు, నందివర్గంలో చేనేత క్లస్టర్లు
- 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు పెన్షన్‌లు
- విజయవంతంగా 'వైఎస్సార్ నేతన్న నేస్తం' అమలు



మగ్గంపై వస్త్రాలు నేస్తున్న చేనేత కార్మికురాలు (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): చేనేత పరిశ్రమ అభివృద్ధికి, చేనేత కార్మికుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. ఐదు విడతలుగా వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకాన్ని విజయవంతంగా అమలు చేసింది. బ్యాంకుల ద్వారా ముద్రా రుణాలు ఇప్పిస్తోంది. చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేసి అధునాత పరికరాలు పంపిణీ చేస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో చేనేత రంగం సం'క్షేమ' రంగులు అద్దుకుంది. ఒకప్పుడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 44 చేనేత సహకార సంఘాలు, 25వేలకుపైగా మాగ్గాలు ఉండేవి. దాదాపు 15వేల కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి ఉపాధి పొందేవి. టీడీపీ హయాంలో 2018 నాటికి ఉమ్మడి జిల్లాలో 11 వేల మగ్గాలు మాత్రమే ఉండగా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో 14,650 మగ్గాలు పెరిగాయి.

అధునాతన డిజైన్లు..

ఆదోని, ఎమ్మిగనూరులో చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టరులో 250 మంది కార్మికులు ఉన్నారు. వీరికి అవసరమైన సామగ్రిని 90 శాతం సబ్సిడీపై అందిస్తున్నారు. ఒక్కో క్లస్టరులో రూ.1.35 కోట్ల సబ్సిడీలతో ఆధునాతన పరికరాలు పంపిణీ చేస్తున్నారు. మొదటి విడతలో ఎమ్మిగనూరు క్లస్టరులో రూ.44.58 లక్షలు, ఆదోని క్లస్టరులో రూ.45.98 లక్షల సబ్సిడీతో 40 జాకార్డు సెట్(240 హుక్స్), 157 మోటరైజ్డ్ లిఫ్టింగ్ డివైజు జాకార్డు, 78 ఫ్రేమ్‌లూమ్‌లు(60 ఇంచులు) పంపిణీ చేశారు. అధునాత యంత్ర సామగ్రి అందుబాటులోకి రావడంతో చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందుతోంది. ఇప్పటి వరకు పంచలు, టువాళ్లు, ధోవతులు, దుప్పట్లు, దోమతెరలు తదితరవాటిని తయారు చేస్తున్నారు. మారుతున్న కాలానికి అనువైన వస్త్రాల తయారీకి కోసం క్లస్టరుకు ఒక డిజైనర్‌ను ప్రభుత్వం నియమించింది. వీరు కొత్త డిజైన్‌లు రూపొందించి వాటికి అనుగుణంగా చేనేత కార్మికులకు తగిన శిక్షణ ఇస్తున్నారు.

4,596 మందికి పింఛన్లు

నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం నందివర్గం చేనేత పరిశ్రమకు పెట్టిందిపేరు. నందివర్గంలో చేనేతపరిశ్రమను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చేనేత క్లస్టరు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ 97 మంది చేనేత కార్మికులకు రూ.1.20 కోట్ల సబ్సిడీతో పరికరాలు ఇవ్వనున్నారు. మొదటి విడతలో రూ.44.42 లక్షల సబ్సిడీతో ఆధునాతన చేనేత యంత్రాలు, పరికరాలు పంపిణీ చేస్తున్నారు. చేనేతకార్మికులకు 50 ఏళ్లు నిండితే పింఛన్ ఇచ్చే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించంది.ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4,596 మంది పింఛన్ పొందుతున్నారు. వీరిలో కర్నూలు జిల్లాలో 3,611 మంది, నంద్యాల జిల్లాలో 985 మంది ఉన్నారు.

ముద్రా రుణాల పంపిణీ

చేనేత పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ముద్రా రుణాలు ఇప్పిస్తోంది. ఇందులో రూ.50వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం ఉంది. ముద్రా రుణాలకు రూ.25 వేలు లేదా 20 శాతం ఏదీ తక్కువ అయితే దానిని సబ్సిడీగా ఇస్తారు. కర్నూలు జిల్లాలో 2023–24లో 390 మందికి ముద్రా రుణాలు పంపిణీ చేయాలనేది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 78 మందికి రూ.44.05 లక్షలు మంజూరు చేశారు. నంద్యాల జిల్లాలో 130 మంది చేనేతకారులకు రుణాలు పంపిణీ చేయాలనేది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 52 మందికి రూ.26 లక్షలు మంజూరు చేశారు.

ఆర్థిక చేయూత..

చెప్పింది చెప్పినట్లు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకత. కరోనాతో ఒడిదుడుకులు వచ్చినా.. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని పక్కాగా అమలు చేశారు. ఒక్కో చేనేత కుటుంబానికి ఈ పథకం కింద నెలకు రూ.2,000 ప్రకారం ఏడాదికి రూ.24000 చెల్లించారు. ఐదు విడతల్లో ఒక్కో కుటుంబానికి రూ.1.20 లక్షల ఆర్థిక లబ్ధి చేకూరింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ. 47.58 కోట్ల లబ్ధి చేకూరడం విశేషం. కర్నూలు జిల్లాలోని చేనేత కార్మికులకు రూ.38.08 కోట్లు, నంద్యాల జిల్లాలో వారికి రూ.9.04 కోట్లు లబ్ధి చేకూరింది. ప్రభుత్వ చేయూతతో చేనేత కార్మికుల్లో ఆత్మస్థైర్యం పెరిగింది.

పరిశ్రమ అభివృద్ధి చెందింది



ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేనేత రంగం అభివృద్ధి చెందింది. క్లస్టర్లలోని చేనేత కార్మికులకు ఆధునాతన పరికరాలు అందజేస్తున్నాం. ఆధునాతన డిజైన్‌ల తయారీకి చర్యలు చేపట్టాం. బ్యాంకుల ద్వారా ముద్రా రుణాలు ఇప్పిస్తున్నాం.

– హరికృష్ణ, ఏడీ, జిల్లా చేనేత, జౌళిశాఖ, కర్నూలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద లబ్ధిపొందిన కుటుంబాల వివరాలు

సంవత్సరం	చేనేత కుటుంబాలు	లబ్ధిపొందిన మొత్తం (రూపాయల్లో)
2019-20	3,998	9,59,52,000
2020-21	3,991	9,57,84,000
2021-22	3,738	8,97,12,000
2022-23	3,950	9,48,00,000
2023-24	4,148	9,95,52,000
మొత్తం	19,825	47,58,00,000

ఆదుకున్న నేతన్న నేస్తం



మాకు ఒక మగ్గం ఉంది. పట్టు చీరలు నేస్తాం. 2018 వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నేతన్న నేస్తం కింద ఏటా రూ.24వేల ఆర్థిక సాయం అందిస్తోంది. ఐదు విడతలుగా ఈ పథకం కింద రూ.1.20 లక్షల ప్రయోజనం పొందాం. ప్రభుత్వ సాయంతో ఈ రంగంలో నిలదొక్కుకున్నాం.

–బి. పద్మావతి, 6వ వార్డు, ఎమ్మిగనూరు

కార్మికులకు భరోసా లభించింది



మేం పట్టు చీరలు నేస్తున్నాం. ఐదు విడతలుగా వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24 వేల ప్రకారం ఆర్థిక ప్రయోజనం పొందాం. ప్రభుత్వం చేసిన ఆర్థిక సాయంతో మగ్గాలను అభివృద్ధి చేసుకున్నాం. బ్యాంకుల నుంచి అధికారులు ముద్రా రుణాలు కూడా ఇప్పించారు. గతంలో ఏ ప్రభుత్వం చేనేతకారుల అభ్యున్నతికి తగిన చొరవ తీసుకోలేదు. మొదటి సారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. వైఎస్ఆర్ నేతన్న నేస్తం నేతన్నలకు భరోసా ఇచ్చింది.

– చంద్రశేఖర్, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు

'జగనన్న సురక్ష'తో ప్రజారోగ్యానికి భద్రత



పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి షుగర్ పరీక్ష చేస్తున్న ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజల ఆరోగ్యానికి భద్రత ఏర్పడుతోందని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని బురుజుల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు సందర్శించారు. ప్రజలను ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్యశిబిరాల్లో అందిస్తున్న సేవలతో రోగం నయం కాకపోతే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చికిత్స అందుకునే వెసలుబాటు ఉందన్నారు. దీర్ఘకాలంగా ఇంటి వద్దే ఉండి చికిత్స తీసుకుంటున్న రోగులకు రూ. 3 వేల నుంచి రూ.5 వేల వరకు ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.1.70 కోట్లు మంజూరు చేసినట్లు ఎంపీ తెలిపారు. బురుజుల గ్రామానికి శుద్ధజలం కావాలని ప్రజలు అడగడంతో రూ.10 లక్షలు మంజూరు చేశారు. శాశ్వత నీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.12 కోట్లతో రిజర్వాయర్ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప, ఎంపీపీ అనిత, ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు సుబ్బయ్య, శాంతన్న, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల కన్వీనర్ వెంకటేశులు, నాయకులు భరత్‌రెడ్డి, అనిమిరెడ్డి, నరసింహారెడ్డి, ఎంపీడీఓ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

856 అడుగులుగా శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం గురువారం సాయంత్రానికి 856 అడుగులకు చేరుకుంది. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహం శ్రీశైలానికి పూర్తిగా నిలిచిపోయింది. బుధవారం నుంచి గురువారం వరకు జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 11,114 క్యూసెక్కుల నీరు విడుదలైంది. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 3.127 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి ఉత్పాదన అనంతరం నాగార్జున సాగర్‌కు 6,016 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1000 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,270, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,688 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 94.4570 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



నమో.. రాఘవేంద్రాయా!

- శ్రీమఠంలో భక్తుల రద్దీ



మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో గురువారం భక్తుల రద్దీ కనిపించింది. స్వామి మూల బృందావన దర్శనానికి గంట సమయం పట్టింది. సర్వ, సేవా, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు కిక్కిరిశాయి. గ్రామ దేవత మంచాలమ్మ, అన్నపూర్ణ భోజన శాల, పరిమళ ప్రసాదం, పంచామృతం, తీర్థ ప్రసాద కౌంటర్లలో భక్తులతో బారులు తీరి కనిపించారు. ఉదయం శ్రీమఠం ప్రాకారంలో బృందావన ప్రతిమకు పల్లకీ సేవ నిర్వహించారు. బంగారు కవచ ధారణతోపాటు మూలబృందావనాన్ని విశేషంగా అలంకరించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చేపట్టిన సంస్థాన పూజలో భక్తులు తరించారు. జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కర్నూలులో స్పేస్ వీక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు సిటీ: భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో), సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్)ల ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో కర్నూలులోని కొండారెడ్డి బురుజు నుంచి రాజ్‌విహార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్పీ కృష్ణకాంత్ ప్రారంభించారు. వివిధ స్కూళ్ల విద్యార్థులు, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ చేపట్టినట్లు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.బి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమ కాలేజీలో శుక్రవారం నుంచి మూడురోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామన్నారు.

బ్రిడ్జి నిర్మించి మాట నిలబెట్టుకున్నాం

- కౌలూరు దళిత కాలనీ వాసులకు తీరిన ఆఖరి మజిలీ కష్టాలు
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



నాడు: బ్రిడ్జి లేకపోవడంతో మృతదేహాన్ని మోసుకుని వాగు దాటుతున్న దళితులు

పాణ్యం: కౌలూరు సమీపంలోని వాగుపై రూ.25లక్షలతో బ్రిడ్జిని నిర్మించి మాట నిలబెట్టుకున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. జుర్రాగుపై నిర్మించిన బ్రిడ్జిని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2019కి ముందు గ్రామంలో దళితులు ఎవరైనా చనిపోతే వారికి అంత్యక్రియలు చేయాలంటే జుర్రాగు దాటాల్సి వచ్చేదన్నారు. వాగు ప్రవహిస్తున్న సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని, సమస్యను పరిష్కరించాలని టీడీపీ హయాంలో దళితులు పోరాటం చేశారన్నారు. అప్పట్లో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి సాక్షాత్తు కలెక్టర్ వచ్చి పరిశీలించారని, అయినా ఫలితం లేకుండాపోయిందన్నారు. ఈ సమస్యకు తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే కాలనీలో ప్రజలకు మాట ఇచ్చానని, రూ.25 లక్షలతో బ్రిడ్జి నిర్మించి మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. గతంలో చనిపోయిన వ్యక్తికి ఘనంగా అంత్యక్రియలు చేయలేని దుస్థితి ఉండేదన్నారు. అలాంటి దుర్భర పరిస్థితులనుంచి నేడు గట్టెక్కారన్నారు. దళిత కాలనీ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నె కరుణాకర్, బాలస్వామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మహానందిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మండల ఇంజినీరు మహబూబ్‌బాషా, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుమంత్‌రెడ్డి, రాజన్న, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నేడు: బ్రిడ్జిని ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

రీ సర్వేలో నిర్లక్ష్యాన్ని సహించం

- నెలాఖరుకు గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి కావాలి
- డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేకు చార్జ్‌మెమో
- ఆదేశించిన జిల్లా కలెక్టర్ సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన, చిత్రంలో జేసీ మౌర్య



హాజరైన తహసీల్దార్లు, సర్వేయర్లు

కర్నూలు(అర్బన్): రీ సర్వేలో నిర్లక్ష్యాన్ని సహించబోమని, ఫేజ్–3 కింద కేటాయించిన గ్రామాల్లో ఈ నెలాఖరు నాటికి గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ సృజన ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. కర్నూలు, పత్తికొండ డివిజన్లకు చెందిన తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, వీఆర్‌ఓ, విలేజ్ సర్వేయర్లు సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రీ సర్వేపై జాయింట్ కలెక్టర్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని, అయితే ఆమె వేగాన్ని క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అందుకోలేకపోతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల్లో కూడా హౌసింగ్, జగనన్న సురక్ష తదితర ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ రీ సర్వేలో పురోగతి సాధిస్తున్నారన్నారు. జిల్లాలో మాత్రం వెనుకబడి ఉన్నారని, నిర్దేశించిన గడువులోగా లక్ష్యాలను చేరుకోవాలన్నారు. నవంబర్ 30వ తేది నాటికి ఫైనల్ ఆర్‌ఓఆర్ పూర్తి కావాలని ఆదేశించారు. కర్నూలు డివిజన్‌లో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రారంభించని గ్రామాలకు రోవర్‌లను కేటాయించకుండా నిరుపయోగంగా ఉంచినందుకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేకు చార్జ్‌మెమో జారీ చేయాలని సర్వే ఏడీని కలెక్టర్ ఆదేశించారు. అలాగే గూడూరు మండలం మల్లాపురం గ్రామ సర్వేయర్ తనకు కేటాయించిన విధులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించినందున ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విస్తీర్ణం ఎక్కువ ఉంటే అదనపు రోవర్లు

గ్రామ విస్తీర్ణాన్ని అనుసరించి అదనపు రోవర్లను మంజూరు చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. పత్తికొండ డివిజన్‌కు సంబంధించి ఫేజ్–3లో 49 గ్రామాలు, కర్నూలు డివిజన్‌కు 51 గ్రామాలు కేటాయించామన్నారు. వీఆర్‌ఓ, సర్వేయర్లు సమన్వయంతో రీ సర్వే పూర్తి చేయాలన్నారు. ముందుగా రైతులకు నోటీసుల ద్వారా తెలపాలని, అనంతరం గ్రామ సభ నిర్వహించాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్‌కు రోవర్‌ను తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్‌కు సంబంధించి డేటా ప్రాసెసింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేశామని, వాటికి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్‌లో ఏ సమస్య వచ్చినా, అక్కడే పరిష్కరించాలన్నారు. రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే 10(2) సెక్షన్ 11 ద్వారా స్వీకరించాలన్నారు. సమీక్షలో కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు హరిప్రసాద్, మోహన్‌దాస్, సర్వే ఏడీ మణికన్నన్, విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

12 కేంద్రాల్లో ఎస్ఐ మెయిన్స్ రాత పరీక్ష

- నేటి నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

కర్నూలు: రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్ఐ ఉద్యోగాల నియామక ప్రక్రియలో భాగంగా దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఈనెల 14, 15 తేదీలలో కర్నూలులో 12 కేంద్రాల్లో రాత పరీక్ష నిర్వహించనున్నారు. 7,644 మంది పురుషులు, 877 మంది మహిళా అభ్యర్థులు కలిపి మొత్తం 8,521 మంది హాజరుకానున్నారు. ఈనెల 6 నుంచి 12వ తేదీ లోపు slprb.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్‌సింగ్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలు తలెత్తితే 9441450639, 9100203323 సంప్రదించాలన్నారు.

చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

- గత పాలనకు.. ప్రస్తుత పాలనకు తేడాను తెలియజేయండి
- జగనన్నే మళ్లీ రావాల్సిన అవసరముందని చెప్పండి
- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి. చిత్రంలో మేయర్ బీవై రామయ్య తదితరులు

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు మేయర్ బీవై రామయ్య సూచించారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే స్వగృహంలో గృహ సారథులు, కన్వీనర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన 'ఏపీకి జగనే సీఎం ఎందుకు కావాలి' కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, వీటి వల్ల చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లాలని, ఏ హోదాలో ఉన్న వారు అందుకు తగ్గట్లు ప్రణాళిక సిద్ధం చేసుకొని పార్టీ సూచించిన బాధ్యతలు తప్పనిసరిగా నిర్వర్తించాలని సూచించారు. పాదయాత్రలో జగనన్న ఇచ్చి హామీలను 95 శాతం అమలు చేసిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కుమ్మక్కు రాజకీయాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న జగనే మరోసారి ఏపీకి అవసరమని ప్రజలకు వివరించాలన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే పాలన వచ్చిందన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సాగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి, ఓర్వకల్లు, కల్లూరు మండలాల ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్ గౌడ్, ఆల ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రేణుక, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాల అధ్యక్షులు చెన్నారెడ్డి, ఈశ్వరయ్య, కల్లూరు అర్బన్ క్లస్టర్-1 అధ్యక్షుడు భీమ శంకర్‌రెడ్డి, క్లస్టర్-2 అధ్యక్షుడు (కార్పొరేటర్) శ్రీనివాసులు, మండలాల జేసీఎస్ కన్వీనర్లు హనుమంతురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, లోటర్ బాషా, కేశవ రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన గృహసారథులు, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సన్న జీవాల పెంపకానికి రుణాలు

నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా 50 శాతం సబ్సిడీ

- రేపు కోడుమూరు రోడ్డులోని పుష్పరాజ్ ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు
- జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య వెల్లడి



కర్నూలు(అగ్రికల్చర్): గొర్రెలు, మేకలతో పాటు కోళ్ల, పందుల పెంపకాన్ని ప్రభుత్వం జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ నిధులతో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. ఈ కార్యక్రమం 2025-26 వరకు అమలులో ఉంటుంది. గురువారం జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశాల మేరకు జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ప్రాథమిక గొర్రెల పెంపకందారుల చైర్మన్‌లు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, సభ్యులు, మండల, ఆర్‌బీకే స్థాయి వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌లు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్, సభ్యులు తదితరులకు రుణాల పంపిణీకి సంబంధించి మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కోడుమూరు రోడ్డులోని పుష్పరాజ్ ఫంక్షన్ హాల్‌లో ఈ సదస్సు ఏర్పాటవుతుందన్నారు. రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణాలకు సబ్సిడీ 50 శాతం వరకు ఉంటుందన్నారు. రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తల్‌సైనిక్ క్యాంపులో జిల్లా విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం కమాండర్ రమేష్

కర్నూలు సిటీ: ఢిల్లీలో నిర్వహించిన తల్‌సైనిక్ క్యాంప్‌లో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపించారు. వీరిని గురువారం నగరంలోని ఎన్‌సీసీ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం కమాండర్ ఎన్.రమేష్ మాట్లాడుతూ.. ఆలిండియా తల్ సైనిక్ క్యాంప్-2023 పోటీల్లో దేశవ్యాప్తంగా మొత్తం 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇందులో ఏపీ, తెలంగాణ డైరెక్టర్‌కు చెందిన కర్నూలు గ్రూప్ నుంచి సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ నుంచి జి.గౌరీ శంకర్, పి.అజిత్‌కుమార్, కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీ నుంచి కె.స్రవంతి, అనంతపురం డిగ్రీ కాలేజీ నుంచి జె.భరత్‌కుమార్, హిందూపురం ఎస్‌డీజీఎస్ కాలేజీ నుంచి బి.మేఘన పాల్గొన్నారన్నారు. వీరిలో జి.గౌరీ శంకర్ బంగారు పతకం, పి.అజిత్‌కుమార్, స్రవంతి, జె.భరత్‌కుమార్, మేఘన వెండి పతకాలు సాధించారన్నారు.

జగనన్న కాలనీల్లో అన్ని రకాల వసతులు

- నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలి: కలెక్టర్



ఓర్వకల్లు జగనన్న కాలనీలో మౌలిక వసతులను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: జగనన్న కాలనీల్లో అన్ని రకాల వసతులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ఓర్వకల్లు సమీపంలోని జగనన్న హౌసింగ్ కాలనీని గురువారం జిల్లా కలెక్టర్‌తో పాటు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధలింగమూర్తి సందర్శించారు. కాలనీలో తాగునీటి సౌకర్యం, విద్యుత్తు, అంతర్గత రహదారులు, ముఖద్వారం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్ట మాట్లాడుతూ ప్రతి ఇంటికి నీటి సౌకర్యం, విద్యుత్తు సదుపాయం కల్పించాలన్నారు. ప్రతి ఇంటి వద్ద సోక్‌పిట్‌ను నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ ద్వారానికి త్వరలో రంగులు వేయించాలని సూచించారు. ఈ నెల రెండో వారంలో రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో నిర్మించిన గృహాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్నారని, ఓర్వకల్లు జనన్న హౌసింగ్ కాలనీలో అనువైన స్థలాన్ని కేటాయించాలన్నారు. బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని చూపాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ రహదారి విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితులకు కాల్వబుగ్గలో స్థలాలు కేటాయించామని, అయితే వారికి ఇంత వరకు స్థలాలు చూపించలేదన్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ నిజమైన బాధితులకు తప్పనిసరిగా న్యాయం చేస్తామన్నారు. విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఉమాపతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, హౌసింగ్ ఈఈ నాగరాజు, ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, విద్యుత్ ఏఈ ప్రసాద్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ రామయ్య, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, స్థానిక నాయకులు శంకర్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్వారీల్లో కార్మికుల భద్రతకు చర్యలు



సర్పారాజాపురంలో స్టేటెడ్ క్వారీని పరిశీలిస్తున్న డీడీ రాజశేఖర్ తదితరులు

కర్నూలు (న్యూసిటీ): క్వారీల్లో కార్మికుల భద్రతకు చర్యలు చేపట్టాలని యజమానులను జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ ఆదేశించారు. వెల్దుర్తి మండలంలోని సర్పారాజాపురం, ప్యాపిలి మండంలోని చంద్రపల్లి గ్రామాల్లో ఉన్న స్టేటెడ్ క్వారీలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా స్టేటెడ్ క్వారీల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే ఈ వేలం ద్వారా టెండర్లు నిర్వహించి లీజుకు కేటాయిస్తామని వెల్లడించారు. క్వారీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి నిబంధనలు పాటించాలని సూచించారు. అనుమతికి మించి తవ్వితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చంద్రపల్లి గ్రామంలో లైన్ కంకర క్వారీ పరిశీలించామని, క్వారీ మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక తయారు చేసి పంపామని తెలిపారు. అలాగే డోన్ మండలంలోని ధర్మవరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వెంకటేశ్వర మినరల్ ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీ యజమాని వెంకటేశ్వరరెడ్డి ఒమాన్ దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న సున్నపురాయి ఖనిజ నిల్వను పరిశీలించామని చెప్పారు. ఆయన వెంట విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

మల్లన్న దర్శనం మోక్షదాయకం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శనంతో బుద్ధి, జ్ఞానం, ఐశ్వర్యం, మోక్షం లభిస్తాయని సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. హిందూ ధర్మప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రవచన కార్యక్రమం ఐదో రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రం సిద్ధులన్నిచ్చే మహాక్షేత్రమన్నారు. స్వామివార్ల ఆలయం సమీపంలోనే మల్లికాకుండం, మనోహరకుండం వంటి తీర్థాల మహిమలు పురాణాలలో వర్ణించబడ్డాయన్నారు. పాతాళగంగ దివ్యతీర్థమని పేర్కొన్నారు. శ్రీశైలంలో ఎన్నో దివ్య తీర్థాలు ఉన్నాయని, ఇక్కడి ప్రతి అణువూ మహిమాన్వితమేనని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

నంద్యాలలో జీవీ మాల్ ప్రారంభం

- నందడి చేసిన సినీనటి అనసూయ



జీవీ మాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రారెడ్డి



అభిమానులకు అభివాదం చేస్తున్న అనసూయ

నంద్యాల(సిటీ): నంద్యాల శ్రీనివాసనగర్‌లో జీవీ మాల్‌ను సినీనటి అనసూయ భరద్వాజ్ గురువారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన అనసూయ భరద్వాజ్ మాట్లాడుతూ నంద్యాల పట్టణానికి జీవీ మాల్ రావడం హర్షనీయమన్నారు. అన్ని రకాల వస్త్రాలకు సంబంధించి వెరైటీలు సరసమైన ధరలకు లభిస్తున్నాయన్నారు. అత్యాధునిక వస్త్ర కలెక్షన్లకు నిలయంగా ఉన్న మాల్‌లో అన్ని రకాల పట్టు, రెగ్యులర్ వేర్‌కు స్త్రీ, పురుషులతో పాటు చిన్నారులకు సంబంధించి చాలా వెరైటీలు ఈ షాపింగ్ మాల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లాంటి మహానగరాల్లో ఉండే జీవీ షాపింగ్ మాల్ రావడంతో పట్టణంలో మరింత మన్నికైన వస్త్రాలు సరసమైన ధరకే లభిస్తాయన్నారు. మాల్ అధినేతలు గుత్రం ఉమా మహేశ్వరరావు, గుత్రం వాసు, జనార్దన్ మాట్లాడుతూ వినియోగదారులకు మార్కెట్ ధరతో పోల్చితే జీవీ మాల్ ధరలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. సినీనటి అనసూయను చూసేందుకు పట్టణవాసులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారు డీఎస్. హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టును 'వరి'ంచిన అదృష్టం

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది ఎస్సార్బీసీ(శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్) ఆయకట్టు కింద వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. అయితే గోరుకల్లు జలాశయం నుంచి అధికారులు నీటిని అందిస్తుండటంతో గోరుకల్లు, కొండజూటూరు, పాణ్యం, కొణిదేడు, ఆలమూరు, గోనవరం తదితర గ్రామాల్లో రైతులు ఆలస్యంగా వరి సాగు చేశారు. పైరు పచ్చగా పెరిగి ఈ ప్రాంతమంతా కోనసీమను తలపిస్తోంది. బాటసారులు, వాహనదారులు ఇక్కడ నిలబడి ఫొటోలు దిగుతున్నారు. – పాణ్యం



ఎస్సార్బీసీ కాల్వలో ప్రవహిస్తున్న నీరు



ఆలమూరు సమీపంలో సాగులో ఉన్న వరి

క్లుప్తంగా

నాపరాయి లారీ పట్టివేత



మైనింగ్ అధికారులు పట్టుకున్న లారీ

కర్నూలు (న్యూసిటీ): అక్రమంగా నాపరాయిని తరలిస్తున్న లారీని బుధవారం అర్ధరాత్రి కోడుమూరు దగ్గర పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న నాపరాయి లారీ తనిఖీ చేసి భద్రత నిమిత్తం కోడుమూరు అగ్నిమాపక కేంద్రంలో ఉంచామని ఆయన చెప్పారు. నాపరాయి ఎక్కడ నుంచి తీసుకొస్తున్నారనే వివరాలు తెలుసుకున్న తర్వాత లారీ యజమానిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మైనింగ్ శాఖ అనుమతి ఇచ్చిన మేరకే గనుల్లో తవ్వకాలు జరపాలని, ఎవరైనా అనుమతికి మించి తవ్వితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు సిటీ: సహిత విద్యా వనరుల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా గురువారం సమగ్ర శిక్ష కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం జరిగింది. మొత్తం 279 మంది అభ్యర్థులకుగాను మొదటి రోజున 66 మంది ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మిగిలిన వారి సర్టిఫికెట్లను నేడు, రేపు పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కారు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన ఉసేన్‌సాహెబ్

పాణ్యం: టీడీపీ నాయకుడి కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. పాణ్యం గ్రామానికి చెందిన బలపనూరు ఉసేన్‌సాహెబ్(70) బుధవారం మధ్యాహ్నం పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో బహిర్భూమికి వెళ్తున్నారు. ఇదే సమయంలో మద్దూరు గ్రామానికి చెందిన టీడీపీ మండల నాయకుడు చెందిన ఏపీ 39ఆర్ఎల్ 2424 నంబర్ గల కారు రివర్స్‌లో వచ్చి ఢీకొట్టింది. ఉసేన్‌సాహెబ్‌కు గాయాలు కావడంతో శాంతిరాం ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు షేక్ షంషీర్ ఉసేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతుడికి భార్య మెహరీన్ , కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వ్యక్తి బలవన్మరణం

కోవెలకుంట్ల: సౌదరదిన్నె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గురువారం రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల రాంబాబు(50) తనకున్న పొలంతోపాటు మరి కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య దస్తగిరమ్మ, కుమారులు పెద్ద దస్తగిరి, చిన్న దస్తగిరి గ్రామంలో జరుగుతున్న ఓ ఫంక్షన్‌కు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి ఫ్యాన్‌కు వేలాడుతుండటంతో కిందకు దించి కోవెలకుంట్ల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతుని భార్య దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఈ నెల 6న జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించే ప్రాంతాలను గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రకటించారు.

మండలం	ఆరోగ్య శిబిరం
పత్తికొండ	పందికోన
ఆదోని	సాదాపురం
కౌతాళం	హాలహర్వి
ఎమ్మిగనూరు	కొటేకల్
కోడుమూరు	కోడుమూరు-5
కర్నూలు	బి.తాండ్రపాడు-1
హోళగుంద	హెబ్బటం
గూడూరు	చనుగొండ్ల-2
దేవనకొండ	పి.కోటకొండ-2
కల్లూరు	పర్ల-1
ఓర్వకల్	శకునాల
కర్నూలు	గడ్డవీధి యుపీహెచ్‌సీ
సి.బెళగల్	బురాన్‌దొడ్డి-1
మంత్రాలయం	కాచాపురం-2
తుగ్గలి	ముక్కెళ్ల
పెద్దకడుబూరు	కల్లుకుంట
కోసిగి	దొడ్డి
నందవరం	టి.సోమలగూడూరు-1
వెల్దుర్తి	బింగిదొడ్డి
గోనెగండ్ల	గంజిహళ్లి